# ఊరగాయ మహోత్సవాలు

సమ్మరొచ్చిందటే సరి – ఇహ చూస్కోండి ఆడవాళ్ళని అదుపు చెయ్యడం మన తరం కాదు. ప్రతి ఇంట్లో ఊరగాయ ఉద్యమాలు మొదలువుతాయి. వాళ్ళకన్నా , వీళ్ళకన్నా ముందు పచ్చళ్ళు పెడితే అదో పెద్ద గొప్ప. అంచేత ఈ ప్రయత్నాలు గుంభనంగా, గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. పక్కింటావిడ పచ్చళ్ళు పెట్టారా ' అనడిగితే, ' అబ్బే ఇంకా లేదండీ, కాయ ఇప్పుడిప్పుడే వస్తోంది ' అంటూ దీర్ఘాలు తీస్తూనే, నూనె డబ్బాతో వస్తున్న పతి దేవుడ్ని సంజ్ఞలతో బెదరగొట్టడం ఊరగాయల వ్యూహరచనల్లో ఒక భాగం. అటు తర్వాత ఒక శుభోదయాన, పక్కవాళ్ళ పనిమనిషితో , ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ఊరగాయలు పెట్టేసినట్టుగా డిక్లేర్ చేసేసి, ఇంకా ఆవార్త పిన్నిగారికి చేరకముందే . రుచి పేరిట కాస్త పచ్చడిని పంపడం ఇల్లాలి రాజనీతికి నిదర్శనం. ఆవిడ తయారుచేసిన పచ్చళ్ళు పదిమంది మెచ్చుకుంటే ఆవిడకెంతో గర్వం, తృప్తిన్నూ. ఆర్టు ఫిలిం తీసి అవార్డు పుచ్చుకున్నంత ఆనందం.

ఇల్లాళ్ళ దృష్టిలో ఆవకాయకి ఆధ్యాత్మిక చింతనకి చాలా దగ్గర సంబంధం కనిపిస్తుంది. ' అనసూయమ్మగారి ఆవకాయ అస్సలు చుర్రు లేదంటే ' , ఎలా వుంటుంది ? అంత పొగరా ! మనం అనుకుంటాం. గాని ఉసురు వూరికే పోతుందా, ఊరగాయలకొట్టదూ ' అని , అదే ' మీ మాగాయి మహత్తరం – ఆ రుచిని జన్మలో మరిచిపోలేనని ఏ ఇల్లాలన్నా కితాబు గానీ ఇస్తే , ఎంతో వినయంగా , నమ్రతగా , ' మన్దేం వుందండి . నిమిత్తమాత్రులం . అంతా వాడి దయ ' అంటూ దేవుళ్ళని కూడా పచ్చళ్ళ గొడవలోకి దింపగల సమర్థులు ఈ ఆడవాళ్ళు.

అసలీ పచ్చళ్ళ సీజను మొదలుకాగానే , అందరి ఆరోగ్యాలు అటు ఇటూ కావడం సర్వసాధారణం . డాక్టర్లకి చేతినిండా పని. వాళ్ళేమో చలవ చేసేవి తినమంటారు. కాని మనం రుచుల పేరిట వచ్చిన అందరి ఊరగాయల్ని తినకమానం. కళ్ళు మందారపూల్లాగా పెట్టుకుని, కడుపు మంట అని మళ్ళీ డాక్టర్ని కలవడం. ఆయన మనతో విసుగెత్తిపోయి, వైద్యం చేయలేక , ఏ రాత్రి పూటో మారువేషంలో వచ్చి ఆవకాయ జాడీని అమాంతం చంకలో పెట్టుకుని పారిపోవడమో లేకపోతే మీరు ఆవకాయలు

తిన్నారంటే నే ఆత్మహత్య చేసుకుంటానంతే ' అంటూ ఉగ్ర నర్సింహంస్వామిగా మారడమో జరిగి తీరుతుంది.

ఈ మధ్యనే మా బంధువుల్లో ఓ కుర్రాడు రీసెర్చి చేయాలని నావెల్టీగా వుంటుందని ఊరగాయల్ని సబ్జక్టుగా తీసుకుని కొంత వరకు పని నడిపించి , ఒక రోజు మా ఇంటికొచ్చేడు. ఇంతవరకు సాధించిన తన ప్రగతిని గురించి చెప్తూనే ఒక థియరీ చెప్పాడు. ఆడామగకి, ఆవకాయ , మాగాయకు చాలా దగ్గర సంబంధం వుందట. ఆవకాయ ఆడవాళ్ళ పచ్చడిట. మాగాయ మగవాళ్ళ పచ్చడిట. ఆవకాయ అధికంగా తినే మొగాళ్ళలో ఆడ లక్షణాలు, మాగాయ ఎక్కువగా తినే ఆడవాళ్ళలో మొగ లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయట. వీడి రీసెర్చి కోసం వాళ్ళ వూళ్ళోవున్న ఒక పులిలాంటి మొగాడ్ని ఎన్నుకుని అరవై రోజులు ఆపకుండా ప్రతి రోజూ త్రికాల సమయాల్లో ఆవకాయ గాని తింటే తమరి పేరు గిన్నీస్ బుక్‌లో రాయిస్తానని నమ్మించి అరజాడీ ఆవకాయని అరవైరోజులూ తినిపించేట్ట. అరవైవొకటో నాడు ఆ శాల్తీ గిన్నిస్ పుస్తకం మాట మరిచిపోయి మగవాళ్ళని చూసి సిగ్గుపడటం, భుజాన వున్న ఉత్తరీయాన్ని కొంగుగా కప్పుకోవడం, కనిపించిన ప్రతి ఇల్లాల్ని ' వంటయిందా. కూరలేం చేశారంటూ మీటింగ్ పెడుతున్నాట్ట. అలాగే రోజూ మాగాయి తినే మా పెద్దత్తగారి రెండో పిల్లకి ఇప్పుడిప్పుడే గొంతు బొంగురుపోయి, మాట్లాడుతుంటే వేమూరి జగ్గయ్య గారు పద్యం పాడినట్టు వుంటోందట. సెక్సు మార్పిడి కోరుకునే వాళ్ళకి ఆపరేషన్‌తో నిమిత్తం లేకుండానే ఆవకాయ, మాగాయల ప్రయోగాలతో ఫలితం సాధించవచ్చునని ఆ కుర్రాడు చాలా గట్టిగా వాదిస్తున్నాడు.

అదలా వుంచితే, ఈ ఊరగాయలకు మహోత్సావ నిర్వహణలో మగాళ్ళకి ఆర్థిక , మానసిక శారీరక, ఇబ్బందులు తప్పవ్. ఒక్క రోజు కూడా ఆఫీసుకు సెలవు పెట్టడం ఎరగని ఒక ఫ్రెండు మూడు రోజులుగా రాకపోవడంతో పరామర్శకని వెళ్ళి చూసేసరికి , పాడయిపోయిన ఆవకాయ కత్తి పీటలాగా మంచంలో వ్రేలాడుతున్నాడు. సంగతేమిటంటే చెప్పుకొచ్చాడు. వాళ్ళావిడ ఆవకాయకని కాయలు తెచ్చి , కత్తి పీట చేతికిచ్చి ముక్కలు కొట్టమందిట. కాదనే సాహసం లేక పని మొదలుపెట్టి , చేస్తుండగా పక్కింటి పద్మావతమ్మగారొచ్చి, మా వాడి పనితనాన్ని పబ్లిగ్గా మెచ్చుకుని ' అన్నయ్యగారు ముక్కలు ఎంత ముచ్చటగా తరుగుతున్నారో . కాస్త మాకూ కొట్టి పెట్టరూ ' అంటూ అడిగేసరికి మొహమాటం కొద్దీ కాదన్లేక కత్తి పీట చంకన పెట్టుకుని వాళ్ళింటికి వెళ్ళిపని ప్రారంభించేసరికి ఆ చుట్టుపక్కల వాళ్ళంతా జట్లు జట్లుగా దండయాత్ర చేసి,

వాళ్ళల్లో వాళ్ళు మా ఇంటి కంటే మా ఇంటికంటూ యుద్దాలుచేసి , మళ్ళీ వాళ్ళలో వాళ్ళే రాజీలు చేసుకుని , ఒకళ్ళ ఇంటి తర్వాత ఇంకొకరి ఇంటికి వీడిని, కత్తిపీటని తిప్పారట. ఆ దెబ్బకి వొడిలిపోయి, వాడిపోయి మంచం పట్టాట్ట.

------- అయ్యిపోయింది -------